సాక్షి
ఒడిశా

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,96,399లు, వచ్చాయని అధికారులు తెలిపారు.



రైల్వేస్టేషన్‌లో దోపిడీ

జిమిడిపేట రైల్వేస్టేషన్‌లో భారీ దోపిడీ జరిగింది. రూ.20 లక్షల విలువైన ఆభరణాలు తస్కరించారు.

-8లో

మృతదేహం లభ్యం

రాయగడ: జిల్లాలోని టికిరి పోలీస్ స్టేషన్ పరిధి సిమిలిగుడ గ్రామానికి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఒక యువకుని మృతదేహాన్ని పోలీసులు సోమవారం గుర్తించారు. మృతుడు సిమిలిగుడ గ్రామానికి చెందిన సంతోష్ మాఝిగా గుర్తించారు. అనంతరం పోలీసులు మృతుని కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. ట్రాక్ మీదుగా వస్తున్నప్పుడు రైలు ఢీకొందని సమాచారం.

న్యూస్‌రీల్

రొయిమతికి గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్



రొయిమతీ ఘివురియ

జయపురం: వ్యవసాయ రంగంలో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి నువాగాం గ్రామ నివాసి డాక్టర్ రొయిమతి ఘివురియకు మరో గౌరవ డాక్టర్ డిగ్రీ లభించనుంది. బరంపురం యూనివర్సిటీ ఆమెకు డాక్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ (డి.ఎస్సీ)తో సత్కరించాలని నిర్ణయించింది. బరంపురం యూనివర్సిటీ నిర్ణయానికి గవర్నర్ ఆమోదం ముద్ర వేసినట్లు బరంపురం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ ఈ నెల 1వ తేదీన డాక్టర్ రొయిమతికి పంపిన లేఖలో తెలిపారు. ఈ నెల 9 వ తేదీన బరంపురం యూనివర్సిటీలో బిజూపట్నాయిక్ ఆడిటోరియంలో ఆమెకు డిగ్రీ ప్రదానం చేయనున్నారు.

ఆత్మాహుతి కేసులో ఏబీవీపీ నేత అరెస్టు



శుభ్ర సంబిత్ నాయక్



జ్యోతి ప్రకాష్ బిస్వాల్

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీర్ మోహన్ (అటానమస్) కళాశాలకు చెందిన 20 ఏళ్ల విద్యార్థిని మృతికి సంబంధించి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకుడు సహా మరో నిందితుడిని అరెస్టు చేశారు. అధ్యాపకుని లైంగిక వేధింపులు, సంస్థాగత నిర్లక్ష్యం కారణంగా ఆరోపిస్తూ గత నెల 12న ఆ విద్యార్థిని తనకు తాను నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో చికిత్స పొందుతూ జూలై 14న ఆమె మరణించింది. ఆమె మరణం రాజకీయ దుమారానికి దారి తీసింది. అధికార భారతీయ జనతా పార్టీ నిందితులను రక్షించడానికి ప్రయత్నిస్తోందని ఉభయ ప్రతిపక్షాలు బిజూ జనతా దళ్, కాంగ్రెస్ బాహాటంగా ఆరోపించాయి. తీవ్ర ఒత్తిడి ప్రభావంతో దర్యాప్తు బాధ్యతలను రాష్ట్ర క్రైమ్ శాఖకు అప్పగించారు. ఈ బృందం రంగంలోకి దిగడంతో ఉపాధ్యాయ విద్యా విభాగం ప్రముఖుడు సమీర్ కుమార్ సాహు, కళాశాల ప్రిన్సిపాల్ దిలీప్ ఘోష్ ఇద్దరినీ అరెస్టు చేశారు. తాజాగా క్రైమ్ శాఖ పోలీసులు యువతిని రెచ్చగొట్టి ఆత్మాహుతిని ప్రేరేపించిన ఆరోపణల కింద ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేసింది. వారిలో ఒకరు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నేత, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శుభ్ర సంబిత్ నాయక్ కాగా మరొకరు కళాశాల విద్యార్థి జ్యోతి ప్రకాష్ బిస్వాల్ ఉన్నట్లు పేర్కొన్నారు. ఆత్మాహుతికి పాల్పడిన యువతిని కాపాడే ప్రయత్నంలో విద్యార్థి జ్యోతి ప్రకాష్ బిస్వాల్ స్వల్పంగా గాయపడ్డాడు. కటక్ ఎస్సీబీ మెడికల్ కాలేజీ మరియు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కావడంతో అరెస్టు చేశారు.

కార్మికుల వలసల కట్టడే లక్ష్యం

- వ్యవసాయ శాఖ మంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్
- సంచాలక మైగ్రెంట్ రిసోర్సెస్ రథం ప్రారంభం
- టోల్–ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1800–345–7885 జారీ



సంచాలక మైగ్రెంట్ రిసోర్సెస్ రథం ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి

భువనేశ్వర్:

రాష్ట్రం నుంచి కార్మికుల వలసల కట్టడికి ప్రభుత్వం పూనుకుంది. వివిధ జీవనోపాధి, నైపుణ్యత అభివృద్ధి కార్యక్రమాలు ఉపాధి కల్పన కార్యక్రమాలతో కార్మికుల వలస నివారణకు సరికొత్త వ్యవస్థని ప్రవేశ పెట్టింది. రాష్ట్ర వ్యవసాయం, రైతుల సాధికారత శాఖ బాధ్యతలు వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్ స్థానిక కృషి భవన్ ప్రాంగణంలో సోమవారం సంచాలక మైగ్రెంట్ రిసోర్సెస్ సెంటర్ వాహన సేవల్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టోల్–ఫ్రీ మైగ్రెంట్ రిసోర్సెస్ సెంటర్ హెల్ప్‌లైన్ నంబర్ 1800–345–7885 ను జారీ చేశారు. వలసదారులు ఏదైనా అత్యవసర పరిస్థితులు లేదా సమాచారం పొందడానికి ఈ నంబర్ ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో ఈ తరహా కార్మికుల వలస కట్టడి ప్రయత్నం ఇదే తొలి సారి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆహారం, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ), అంతర్జాతీయ వలస సంస్థ (ఐఓఎమ్), యునైటెడ్ నేషన్స్ మైగ్రెంట్ మల్టీ–పార్ట్‌నర్ ట్రస్ట్ ఫండ్ సంయుక్త సహకారంతో రాష్ట్ర వ్యవసాయం, రైతుల సాధికారత శాఖ రాష్ట్రంలో మొట్టమొదటి మొబైల్ మైగ్రెంట్ రిసోర్సెస్ సెంటర్ ప్రారంభించింది. ఈ చొరవ గంజాం, కేంద్రాపడా జిల్లాల్లో 5 వలస ప్రభావిత మండలాల్లో బలమైన అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. వలస ప్రాంతాల నుంచి స్వస్థలానికి తిరిగి వచ్చిన కార్మికులు, స్థానిక యువత, మహిళలకు వారి సొంత ప్రాంతాల్లో ఉపాధి కల్పించి స్వావలంబన ప్రేరణకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయం, రైతు సాధికారత శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరబింద కుమార్ పాఢి, భారత ప్రభుత్వ విదేశాంగ శాఖ కార్మిక కమిషనర్ ఇంద్రమణి త్రిపాఠి, వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి శుభ్రాంషు మిశ్రా, వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ సంగ్రామ్ కేశరి పట్నాయక్, వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ నాగేంద్ర మల్లిక్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో మంత్రితో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నతాధికారులు

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ



పర్లాకిమిడి: ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ మధుమిత

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్‌లోని రెండో నంబర్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ మధుమత అధ్యక్షతన గ్రీవెన్స్‌సెల్ జరిగినది. జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా, జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ అధికారి అంశుమాన్ మహాపాత్రో, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు హాజరై వినతులు స్వీకరించారు. రాణిపేట, పర్లాకిమిడి పురపాలక సంఘం, సిద్ధమణుగు పంచాయతీల ప్రజలు గ్రీవెన్స్ హాజరయ్యారు. మొత్తంగా 116 వినతులు అందగా.. వాటిలో వ్యక్తిగతం 19, గ్రామ సమస్యలు 97 ఉన్నాయి. తొమ్మిది వినతులను కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కరించారు. గుసాని బీడీవో గౌరచంద్ర పట్నాయక్, తహసీల్దార్ నారాయణ బెహరా, సీడీఎంవో డాక్టర్ యం.యం.ఆలీ పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో 25 వినతుల స్వీకరణ

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో కలెక్టర్ సోమేశ్‌కుమార్ ఉపాధ్యాయ నేతృత్వంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు 25 వినతులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో కలెక్టర్ మాట్లాడి..సమస్యలు తెలుసుకున్నారు. త్వరగా వినతులను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వినోద్ పటేల్, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ కుమార్ సోఖరో, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, జిల్లా వైద్యాధికారి బ్రోజోదాస్ పాల్గొన్నారు.



పర్లాకిమిడి: క్యూలైన్‌లో ప్రజలు



మల్కన్‌గిరి: వృద్ధురాలి సమస్య వింటున్న కలెక్టర్ సోమేశ్



మల్కన్‌గిరి: కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న మహిళలు



మల్కన్‌గిరి: గ్రీవెన్స్‌కు హాజరైన ప్రజలు

సెలవుల్లో డాక్టర్లు..ఇబ్బందుల్లో రోగులు!



ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు

- జిల్లా కేంద్రాస్పత్రిలో దుస్థితి

జయపురం: జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పని చేస్తున్న 22 మంది డాక్టర్లు ఎన్ఈఈటీ–పీజీ –2025 సెలవులు పెట్టారు. దీంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 40 శాతం మంది డాక్టర్లు లేకపోవటంతో ప్రసూతి శిశు వైద్య విభాగం(ఎమ్‌సీహెచ్)తోపాటు రెండు ఓపీడీలు మూత పడ్డాయి. ఈ ఆస్పత్రికి రోజూ వెయ్యి మందికిపైగా రోగులు వైద్యం కోసం వస్తుంటారు. ఇక్కడ 52 మంది డాక్టర్లు సేవలందిస్తుంటారు. అయితే ఎన్ఈఈటీ–పీజీ పరీక్షలు రాసేందుకు ఒకేసారి 22 మంది సెలవలులు పెట్టేశారు. దీంతో మిగతా డాక్టర్లపై బాధ్యత పెరిగింది. ఫలితంగా జిల్లాకేంద్ర అధికారులు శిశు, ప్రసూతి, మహిళల వైద్య విభాగాన్ని ఓట్‌డోర్ విభాలకు మూసి వేశారు. దీంతో నూతన భవనాల్లో వైద్య పరీక్షల కోసం వచ్చిన వందలాది మంది రోగులు బారులు తీసి ఉండాల్సి పరిస్థితి నెలకుంది. పరీక్షలకు వెళ్లిన డాక్టర్లు త్వరలోనే వస్తారని, వారు వచ్చిన తరువాత పరిస్థితి యథాస్థితికి చేరుకుంటుందని జిల్లా మెడికల్ అధికారి దిలీప్ కుమార్ బిశ్వాల్ వెల్లడించారు. వాస్తవంగా డాక్టర్ల కొరత ఇక్కడ చాలా ఏళ్లుగా వెంటాడుతోంది. తొలుత 126 డాక్టర్ పోస్టులు మంజూరవ్వగా ప్రస్తుతం 52 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరిలో ప్రస్తుతం 22 మంది సెలవుల్లో ఉండడంతో వైద్య సేవలు అందని పరిస్థితి నెలకుంది.



మూతపడిన ఔట్ పేషెంట్ విభాగం

సిద్ధేశ్వర మందిరంలో చోరీ



చోరీ జరిగిన ఆలయం

జయపురం: జయపురంలో దొంగలు అలజడి సృష్టిస్తున్నారు. నిత్యం పట్టణంలో ఏదో ఒక ప్రాంతంలో చోరీలకు పాల్పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా తలుపులకు తాళాలు వేసి ఉన్న ఇళ్లు, దేవాలయాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేస్తున్నారు. మూడు రోజుల్లో వరుసగా పట్టణంలో దొంగతనాలు జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. స్థానిక మంగరాజ్ నగర్, రుద్రాక్ష నగర్, లింగరాజ్ నగర్‌లో గురువారం, శుక్ర, శనివారాలలో వరుసగా దొంగతనాలు జరిగాయి. ఆదివారం రాత్రి ఇరిగేషన్ కాలనీలోని సిద్ధేశ్వర మందిరంలో దొంగతనం జరిగింది. సోమవారం ఉదయం మందిరం ఎదురుగా ఉన్న దుకాణం యజమాని చూడగా మందిరానికి ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి స్థానికులకు తెలియజేశారు. మందిరానికి గల నాలుగు గేట్ల తాళాలు బద్ధలు కొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు స్టోర్ రూంలోని రెండు వంట గ్యాస్ సిలిండర్లు, రాగి పల్లెం, దేవతల కోసం భద్రపరిచిన విలువైన దుస్తులు దోచుకుపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

బీజేడీ జిల్లా శాఖ అధ్యక్షుల్లో స్వల్ప మార్పులు

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ 4 జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆమోదంతో బిక్రమ్ పండా (గంజాం), శివప్రసాద్ భోల్ (కేంద్రాపడా), ప్రదీప్ దిషారి (కలహండి), ప్రఫుల్ల సింగ్ (కటక్) జిల్లా శాఖ కొత్త అధ్యక్షులుగా నియమితులయ్యారు.

13 మంది విద్యార్థులకు మలేరియా



ప్రభుత్వాస్పత్రిలో చేరిన విద్యార్థులు

రాయగడ: స్థానిక అంబాగుడ వద్ద గల ఆర్ఎస్ ఈడబ్ల్యూసీ పాఠశాలలో చదువుతున్న 13 మంది విద్యార్థులకు మలేరియా సోకింది. గత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న వీరి రక్తన మూనాలు సేకరించి పరీక్షించగా మలేరియా వ్యాధి సోకినట్టు గుర్తించారు. దీంతో పాఠశాల నిర్వాహకులు సోమవారం విద్యార్థులను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

అప్పు తీర్చలేదని వ్యక్తి హత్య



ఎంపీవీ 81 గ్రామంలో ఓ ఇంటి వద్ద విపుణ్ మృతదేహం



కన్నీరుమున్నీరుగా రోదిస్తున్న విపుణ్ భార్య

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి గుముకా పంచాయతీ ఎంపీవీ 10 గ్రామానికి చెందిన విపుణ్ మండల్ (24) ను ఆదివారం హత్య చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం విపుణ్‌ను ఎంపీవీ 81 గ్రామానికి చేందిన అనంత్ హల్దార్, తన స్నేహితుడు సుజిత్ రాయ్‌లు ఇద్దరూ కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. తమ వద్ద తీసుకున్న రూ.30వేలు తిరిగి ఇవ్వకపోవడంతో నిపుణ్‌ను కాలు చేతులు కట్టేసి తమ వెంట తీసుకుని వెళ్లడం కుటుంబ సభ్యులు చూసి అనంత్‌ను ప్రశ్నించగా మాట్లాడి వదిలేస్తానని చెప్పారు. శనివారం గ్రామానికి వచ్చి నిపుణ్‌కు ఆరోగ్యం బాగోలేదని చనిపోయాడని తెలిపారు. దీంతో విపుణ్ తండ్రీ చాణిక్య మండల్ కలిమెల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం రాత్రి వరకు మృతదేహాన్ని చూపించలేదు. దీంతో పోలీసులు సుజిత్, అనంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని సోమవారం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విపుణ్ భార్య ప్రస్తుతం నిండు గర్భిణి.

సమాజ చైతన్యానికి సాహిత్యం దిక్సూచి



మాటిలగ్న సాహితీ సంసద్ వేదికపై ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు

జయపురం: సాహిత్యం సమాజ చైతన్యానికి దిక్సూచి అని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ సునయన మెడికల్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఒడిశాలో ప్రముఖ సాహితీ సంస్థ మాటిలగ్న సాహిత్య సంసద్ ప్రతిష్టా దినోత్సవంలో బాహిణీపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాహిత్యం జాతి వికాసానికి తొలిమెట్టు అని అంటూ సాహితీ వేత్తలు, రచయితలు సమాజాన్ని చైతన్యపరిచే రచనలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భాష జాతి గుర్తింపునకు మైలు రాయి కాగా సాహిత్యం ప్రగతికి ఆధారమని అన్నారు. మల్కన్‌గిరి జిల్లాలో ఏర్పడిన మాటిలగ్న సాహితీ సంసద్ రాష్ట్ర స్థాయిలో ఒక మంచి సాహితీ సంస్థగా పేరుగాంచటం ఆనందకరమైన విషయమని అన్నారు. సంస్థ ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. సాహితీ సంస్థ అధ్యక్షుడు కిశోర చంద్ర ప్రధాన్ అధ్యక్షతన జరిగిన ఈ సాహితీ సమావేశాన్ని ఎమ్మెల్యే బాహిణీపతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సభలో ఆకాశవాణి జయపురం విశ్రాంత డైరెక్టర్ నరేంద్ర కుమార్ పట్నాయిక్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యవక్తగా జయపురం సాహితీ సంసద్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ దాస్ పాల్గొని ఒడిశా సాహిత్య విలువలపై ప్రసంగించారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు నరశింహప్రసాద్ నాయిక్, సమీర్ కుమార్ మహాపాత్ర, డాక్టర్ యజ్ఞేశ్వర పండ తదితరులు పాల్గొని ఒడియా సాహిత్యంపై ప్రసంగించారు. మాటిలగ్న సాహితీ సంసద్ కార్యదర్శి శుభాంశు శేఖర్ పాఢీ వార్షిక నివేదికను సభికులకు వివరించారు. డాక్టర్ కిశోర్ చంద్ర నంద సాహితీ సభను నిర్వహించారు.



సాహితీ సాధకులను సన్మానిస్తున్న నిర్వాహకులు

బోల్‌భమ్ భక్తులతో కిటకిట



కొండ దిగువున ఉన్న నందీశ్వరుని వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పూజలు అందుకుంటున్న మల్లికేశ్వర్ స్వామి



బోల్‌భమ్ భక్తులతో కిటకిటలాడిన మల్లికేశ్వర్ ఆలయం



కొండపైకి కావిడితో నీరు తెస్తున్న బోల్‌భమ్ దీక్షధారులు



కొండపైకి ఎక్కుతున్న మహిళలు

మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో పాత్రగూఢ వీధి వద్ద గల కొండపై వెలసిన శ్రీమల్లికేశ్వర్ స్వామి ఆలయం వద్ద సోమవారం బోల్‌భం భక్తులు సందడి చేశారు. కావిడ్లతో నీరు తెచ్చి స్వామికి సమర్పించారు.

మల్కన్‌గిరి

క్లుప్తంగా

కొత్త ఏడీజే, విజిలెన్స్ కోర్టుల ఏర్పాటుకు ఉత్తర్వులు

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్తగా 8 అదనపు జిల్లా జడ్జి (ఏడీజే) కోర్టులు, 3 విజిలెన్స్ కోర్టుల ఏర్పాటుకు న్యాయ శాఖ ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ప్రకారం బంకి, రాణిపూర్, బొణొపూర్, బాసుదేవ్‌పూర్, పిప్పిలి, తాల్చేర్, రాజ్‌గంగ్‌పూర్, జి.ఉదయగిరి ప్రాంతాల్లో 8 అదనపు జిల్లా జడ్జి కోర్టులు ఏర్పాటు చేస్తారు. కేంద్రాపడా, నయాగఢ్, పూరీ ప్రాంతాల్లో 3 విజిలెన్స్ కోర్టులు ఏర్పాటవుతాయి.

అత్యాచారం చేశారని ఫిర్యాదు

రాయగడ: తనపై అత్యాచారం జరిగిందని, దీనిపై జిల్లాలోని గుణుపూర్‌లో గల ఆదర్శ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు నిందితుడిని పట్టుకోవడం లేదని ఒక యువతి సోమవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కలెక్టర్ అశుతోష్ కులకర్ణికి విన్నవించారు. గుణుపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్జిలి గ్రామానికి చెందిన చిన్నారావు అనే వ్యక్తి తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని, దీనిపై 10 వ తేదీన గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, కానీ వారు చర్యలు తీసుకోలేదని తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

చిక్కిన మొసలి



అటవీ శాఖ సిబ్బందికి చిక్కిన మొసలి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి యం.పి.వి.83 గ్రామంలోని చెరువులో మొసళ్లు వున్నాయి. అని దాని కోసం ముడు రోజులుగా గాలింపు చర్యలు అధికారులు చేపడుతున్నారు .అయితే చివరికు సోమవారం చెరువులో నీటి మఠం తగ్గించి చివరి ప్రయత్నంగా వేసిన వలకు ఓ మొసలి చిక్కింది. ఈ చెరువు 15 అడుగుల లోతు ఉండటంతో మొసలి చాల ఇబ్బంది పెట్టినట్టు అటవీశాఖ వారు తెలిపారు .నీరు పైపు ద్వారా బయటకు తీయించి అనంతరం మొసలిని పట్టుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నరు.

శ్రీమందిరంలో రహస్య కెమెరాతో చిత్రీకరణ

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయంలో రహస్య కెమెరాతో నిషేధిత దృశ్యాల్ని చిత్రీకరిస్తున్నట్లు అనుమానం రావడంతో సోమవారం ఓ భక్తుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక టౌన్ పోలీస్ ఠాణాలో అతడిని ప్రశ్నిస్తున్నారు. శ్రీ మందిరంలో తరచూ ఇటువంటి సంఘటనలు జరగడంతో భద్రతా వైఫల్యాలను బలపరుస్తున్నాయి. కళ్లజోడులో అమర్చిన స్పై కెమెరాతో శ్రీమందిరం లోపలి దృశ్యాల్ని చిత్రీకరిస్తూ ఇటీవల స్థానిక యువకుడు పట్టుబడిన విషయం తెలిసిందే.

90 లీటర్ల నాటుసారా స్వాధీనం

రాయగడ: చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని తెరువలి డీపీ క్యాంప్ ప్రాంతంలో పోలీసులు ఆకస్మిక దాడులను నిర్వహించారు. దాడుల్లో 90 లీటర్ల నాటుసారా, 27 లీటర్ల వివిధ బ్రాండ్‌లు గల విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. భగవాన్ సాహు అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు సోమవారం తరలించారు.

120 కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు అక్రమ రవాణా కోసం అడవిలో దాచిన 120 కిలోల గంజాయిని ఆదివారం రాత్రి పట్టుకున్నారు. బలిమెల పోలీసు స్టేషన్ పరిధిలో గల జబాగడ్ గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలించేందుకు గంజాయిని బస్తాల్లో ఉంచి నిల్వ చేశారు. విషయం తెలుసుకున్న బలిమెల ఐఐసీ దీరాజ్ పట్నాయక్ తన సిబ్బందితో ఆ గ్రామ అడవిపై ఆదివారం రాత్రి దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసున్నారు. సోమవారం తూకం వేయగా 120 కేజీలు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. దాని విలువ సుమారు ఐదు లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

రూ.1.66 లక్షల ఆర్థిక సాయం అందజేత

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సీహెచ్ రంజిత్ కొద్ది నెలలుగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. వారి కుటుంబం ఆర్థికంగా వెనుకబడడంతో సరైన వైద్యం అందించలేని పరిస్థితి ఉంది. ఈ విషయాన్ని గమనించిన కళాశాల అధ్యాపకులు విద్యార్థి పరిస్థితిపై చలించిపోయారు. ఈ మేరకు ఉదార హృదయంతో వారంతా కలిసి రూ.1.66 లక్షలు సేకరించి కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్ చేతులమీదుగా సోమవారం రంజిత్ కుటుంబానికి అందజేశారు. దీంతో వీరిని స్థానికులు అభినందించారు.

రైల్వే స్టేషన్‌లో భారీ దోపిడీ

- రూ.20 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు తస్కరణ
- ఆర్పీఎఫ్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు




సీసీ కెమెరాలో దొంగలను గుర్తించిన రైల్వే పోలీసులు

బాధితుడు ఆర్.ముళ్ల

రాయగడ: సదరు సమితి జిమిడిపేట రైల్వే స్టేషన్‌లో భారీ దోపిడీ జరిగింది. రాయగడ నుంచి గుంటూరు వైపు వెళ్లున్న ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న నగల వ్యాపారిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి, అతని వద్ద గల బంగారు నగల బ్యాగ్‌ను లాక్కొని పారిపోయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. అలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విశాఖపట్నం జిల్లా గాజువాక ప్రాంతానికి చెందిన ఆర్.ముళ్ల అనే నగల వ్యాపారి రాయగడకు వచ్చారు. ఇక్కడ నగల వ్యాపారస్తులకు తాను తీసుకువచ్చిన నగలను విక్రయించడంతోపాటు ఆర్డర్ల ప్రకారం నగలను తయారీ చేసి తిరిగి ఇస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాయగడకు వచ్చిన ముళ్ల ఇక్కడి నగల వ్యాపారస్తులను కలిసి లావాదేవీలను పూర్తి చేసుకుని తిరిగి గాజువాకకు వెళ్లేందుకు మధ్యాహ్నం రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ కంపార్ట్‌మెంట్ బి-2 బోగీలో ప్రయాణిస్తున్నాడు. ట్రైన్ జిమిడిపేట చేరేసరికి గుర్తుతెలియని ఐదుగురు దుండగులు అదే కంపార్ట్‌మెంటులోకి చొరబడి వ్యాపారిపై దాడి చేసి, నగల బ్యాగుస్ లాక్కొని పారిపోయారని బాధితుడు రైల్వే పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్యాగులో సుమారు 200 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయని వివరించారు. దుండగులు తన వద్ద గల బ్యాగును లాక్కొని పారిపోతున్న సమయంలో తాను కూడా కొంతవరకు వెంబడించానని, వారు ఫ్లై ఓవర్ మీదుగా సమీప అడవుల్లోకి పారిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం రాయగడ జ్యూయలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కింతలి ఆమర్‌నాథ్, మరి కొందరు వ్యాపారస్తుల సహాయంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలియజేశాడు. దర్యాప్తు చేపట్టిన రైల్వే పోలీసులు జిమిడిపేట రైల్వే స్టేషన్‌లో గల సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తించారు.

సైకత దర్శనం



పవిత్ర శ్రావణ సోమవారం సందర్భంగా బోల్ భమ్ దీక్ష ముగింపు పురస్కరించుకుని పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో 30 అడుగుల పొడవైన సైకత శిల్పాన్ని ఆవిష్కరించాడు. శివపార్వతుల శిరసున పొడుగాటి కలశ కావడిని తీర్చిదిద్దాడు. బోల్ భమ్ దీక్ష సమగ్ర సారాంశాన్ని పొందుపరచి సందర్శకుల దృష్టిని ఆకర్షించాడు.
– భువనేశ్వర్

సీఎం నివాసం ముట్టడికి విఫలయత్నం



ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి ఉద్యమిస్తున్న యువజన కాంగ్రెసు కార్యకర్తలు

భువనేశ్వర్: దివంగత బొలొంగా బాలిక, ఫకీర్ మోహన్ అటానమస్ కళాశాల విద్యార్థిని, ధర్మశాల ఎమ్మెల్యే అత్యాచారానికి గురైన మహిళా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోమవారం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నివాసాన్ని చుట్టుముట్టింది. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రంజిత్ పాత్రో నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో పోలీసులతో ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు పలువురు యువజన కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రంజిత్ పాత్రో మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఒడిశా మహిళలకు న్యాయం అందించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో రోజుకు సగటున 15 మంది మహిళలు అత్యాచారానికి గురవుతున్నారని, మోహన్ చరణ్ మాఝీ సర్కార్ అత్యాచారం కేసులను అణగదొక్కి నిందితులకు అండగా నిలుస్తుందని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా సృష్టించిన అభూత కల్పన ఆధారంగా కథనంపై పోలీసులు, దర్యాప్తు సంస్థ నివేదికను రూపొందిస్తున్నారని ఆరోపించారు.

ఫలాలతో అలంకరణ



శ్రావణ మాసం సోమవారం పురస్కరించుకుని కటక్ జిల్లాలో ధవళేశ్వరుడు బహుళ జాతి ఫలాలతో శోభాయమానంగా భక్తులకు దర్శనం ఇచ్చాడు. ఈ సందర్భంగా దేవస్థానం భక్తుల తాకిడితో కళకళలాడింది.
– భువనేశ్వర్

7న బీజేడీ శంఖారావం

భువనేశ్వర్: పూరీ జిల్లా బొలొంగా ఠాణా బయాబొరొ గ్రామానికి చెందిన బాలికపై జరిగిన లైంగిక దాడి తదనంతర అనుమానాస్పద మరణంపై న్యాయం చేయాలనే డిమాండ్‌తో బిజూ జనతా దళ్ (బీజేడీ) ఈ నెల 7వ తేదీన 6 గంటల సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మె ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిరవధికంగా కొనసాగుతుందని సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. దర్యాప్తులో తీవ్రమైన లోపాలు జరిగాయని, నేరస్తుడిని రక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీజేడీ ఆరోపించింది. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ బాలిక మరణించిన తర్వాత అధికారులు ప్రచారం చేసిన కథనంలో బీజేడీ పలు అసమానతలను ఎత్తి చూపింది. పూరి జిల్లా బీజేడీ అధ్యక్షుడు ఉమాకాంత సమంత్రాయ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కేసు విచారణ, దర్యాప్తులో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో చట్టం అమలులో వైఫల్యం పట్ల వేలెత్తి చూపారు. ప్రభుత్వం నిర్ణయాత్మకంగా వ్యవహరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తును నిష్పాక్షికంగా జరగాలని బీజేడీ డిమాండ్ చేసింది. వాస్తవాల్ని వెలుగులోకి తెచ్చి చట్టపరంగా నిందుతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మలో సోమవారం సాయంత్రం విద్యుత్ షాక్ తగిలి ఇద్దరు మహిళా కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు బొరిగుమ్మ కమ్యూనిటీ హాస్పిటల్‌కు తరలించారు. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బొరిగుమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో నిరంజన్ సాహు అనే వ్యక్తి కొత్త ఇంటిని నిర్మిస్తున్నారు. ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో దొలయిగుడ గ్రామానికి చెందిన తులసి హరిజన్, వాసి చంద్రమా భూమియ గాయపడ్డారు. తులసి శరీరం 50 శాతం కాలిపోవడంతో ప్రాథమిక చికిత్స అనంతరం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయక్ వైద్య కళాశాలకు 108 అంబులెన్స్‌లో తరలించినట్లు సమాచారం.

మహిళ పేరుతో ఫేక్ ఇన్‌స్టాగ్రామ్

- ఇద్దరు యువకుల అరెస్టు



ఫేక్ ఇన్‌స్టాగామ్ నడుపుతున్న నిందితులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి సోమానాథ్‌పూర్ పంచాయతీ ఎం.వి-36 గ్రామానికి చెందిన ఓ వితంతు మహిళ పేరుపై ఆదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఇన్‌స్టాగామ్ ఖాతా ఓపెన్ చేశారు. ఆమె ఫొటోను ఎడిట్ చేసి అసభ్యకరమైన పోస్టులు చేస్తున్నారు. ఈ విషయంపై ఆమె జూన్‌లో బలిమెల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐఐసీ ధీరజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం సుజాన్ ముజుందార్, సంజిత్ హాల్దర్‌ను అరెస్టు చేశారు. వీరిద్దరూ ఫోన్ ద్వారానే ఫేక్ ఇన్‌స్టాగామ్ నడుపుతుట్లు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి విచరణ చేపట్టారు. అనంతరం కోర్టుకు తరలిస్తామని ఐఐసీ ధీరజ్ తెలిపారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కోర్టుల్లో ఏళ్లకు ఏళ్ల న్యాయ వివాదాలు నడుస్తున్నాయని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు మధ్యవర్తిత్వం ఉత్తమ మార్గమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పేర్కొన్నారు. 90 రోజుల మీడియేషన్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన న్యాయవాదులు కక్షిదారులకు అనుకూలంగా వ్యవహరించాలని, కోర్టు వెలుపలే పరస్పర రాజీలకు ప్రయత్నించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు చట్ట సహాయాన్ని పొందేందుకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు నెలలో చేపట్టిన కార్యకలాపాలపై సమీక్ష జరిపారు. సమావేశంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, పలువురు న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా విశ్రాంత మహిళా ఉద్యోగి మృతి

నరసన్నపేట: స్థానిక శ్రీనివాసనగర్-5లో అద్దె ఇంట్లో నివాసముంటున్న ఆర్.సూర్యకాంతం (62) అనుమానాస్పదంగా మృతి చెందారు. గత మూడు రోజులుగా ఇంటి డోర్ తెరవకపోవడంతో ఇరుగుపొరుగు వాళ్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆమె పెంపుడు కుమార్తె జ్యోత్స్న ఆదివారం రాత్రి వచ్చి పరిశీలించగా సూర్యకాంతం మంచంపై మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్ ఇంటిని సోమవారం పరిశీలించి కేసు నమోదు చేసి, పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా సూర్యకాంతం మండలంలోని మాకివలస పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా పనిచేస్తూ జూన్ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందారు. ఆమె ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. కుమార్తె జ్యోత్స్నకు వివాహమవ్వగా రాయగడలో ఉంటున్నారు. ఈ దశలో ఆమె మృతి చెందారు. ఆమె పెంపుడు కుమార్తె జ్యోత్స్న మాట్లాడుతూ రెండు రోజుల క్రితం తనతో అమ్మ మాట్లాడి ఒంట్లో బాగులేదని చెప్పారన్నారు. అయితే ఆ తర్వాత ఆమె నుంచి ఫోన్ రాకపోవడం, తాము చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి ఓనర్‌కు పరిశీలించమన్నామన్నారు. ఇంటి తలుపులు లోపల నుంచి వేసి ఉన్నాయని చెప్పారన్నారు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుందని చెప్పడంతో ఆదివారం రాత్రి వచ్చి పరిశీలించగా మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంటలో వ్యవసాయ కూలీ బమ్మిడి రాజారావు(50) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాలతో మూడు రోజుల క్రితం పొలాలకు వినియోగించే కలుపు మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు.

గంజాయితో ఆరుగురు అరెస్టు

ఆమదాలవలస: పట్టణంలోని వన్ వే ట్రాఫిక్ రోడ్ జంక్షన్ కంద్రపేట సమీపంలో గంజాయి తరలిస్తుండగా ఆరుగురు వ్యక్తులను ఆమదాలవలస పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఆమదాలవలస పోలీసులు దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి బయటకు వస్తున్న వ్యక్తులను పట్టుకొని ఆరా తీశారు. వారి వద్ద 15 గంజాయి చాక్లెట్లను గుర్తించినట్లు తెలిపారు. ఈ చాక్లెట్లు సుమారు 90 గ్రాముల బరువు ఉంటాయని పేర్కొన్నారు. దీంతో శ్రీకాకుళం సెవెన్ రోడ్డు జంక్షన్ సమీపంలోని సారంగడోల వీధికి చెందిన సిరిగిడి శ్రీనివాసరావు, కటుమల తరుణ్ కుమార్, బొప్పిడి మణికృష్ణ, వంజరపు భార్గవ్, శ్రీకాకుళం దమ్మలవీధికి చెందిన ఫరీద్ ఖాన్, శ్రీకాకుళం రెల్లివీధికి చెందిన జలగడుగుల ప్రసాద్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

చోరీ కేసులో నిందితుని అరెస్టు



స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలతో పోలీసులు

రాయగడ: చోరీ కేసుకు సంబంధించి సదరు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తి స్థానిక ఇందిరానగర్ మూడో లైన్ లొ నివాసముంటున్న బడుమూరు మనికంట్ సుబుద్ధి గా గుర్తించారు . అతని నుండి 32 వేల రుపాయల నగదు, స్టీల్ బాక్స్‌లో గల 600 రుపాయల నాణాలు, ఒక బంగారు లాకెట్, బంగారు పూత గల లక్కీ బాక్స్, వెండి పట్టీలు, 40 వెండి కాయిన్లు, 8 వెండి ఆభరణాలు, రెండు రొల్డ్ గొల్డ్ ఆభరణాలు, ఒక మొబైల్ ఫొన్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. సదరు పోలీస్ స్టేషన్ ఐఐసి ప్రశన్న కుమార్ బెహర తెలియజేసిన వివరాల ప్రకారం ...గత నెల 26 వ తేదిన స్థానిక పంచవటి నగర్ లొ నివాసముంటున్న బి గంగారావు అనే వ్యక్తి ఇంటిలొ చొరీ జరిగింది. దీనికి సంబంధించి బాధితుడు పోలీస్ స్టేషన్ లొ ఫిర్యాదు చేసాడు. ఇంటిలొ ఎవరూ లేని సమయంలొ గుర్తు తెలియని దుండగులు ఇంటిలొ చొరబడి ఇంటిలొ గల 1,30,00ఏ రుపాయల నగదు, 4 వెండి ప్లేట్లు, మూడు జతల చెవి దిద్దులు దొంగతనం జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేసాడు . దీనిపై కేసు నమోదు చే సిన పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు.

శ్రీముఖలింగంలో శివ స్వాముల సందడి



ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహిస్తున్న శివస్వాములు

జలుమూరు: శ్రావణ మాసం సోమవారం ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగంలో శివస్వాములు మధుకేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి వారు తెచ్చిన తేనె, పానకాలు, ఇరుముడులు స్వామికి సమర్పించి గోలెం మొక్కులు తీర్చారు. ప్రతి ఏడాది స్వామివారికి దీక్షతో మొక్కులు తీర్చి ఇరుముడి సమర్పించడం శివ భక్తులు ఆచారం అని భక్తులు తెలిపారు. అలాగే పర్లాఖిముండి, కాశ్రగడ నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదిత్యుని ఆలయంలో నియామకాలు



అరసవల్లి ఆదిత్యాలయం

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో సిబ్బంది కొరతకు చెక్ పడనుంది. ఇంతవరకు దినసరి వేతనదారుల రూపంలో పనిచేస్తున్న సిబ్బంది స్థానంలో కొత్తగా అవుట్ సోర్సింగ్ విధానంలో నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు ఈనెల 18న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ కోసం టెండర్ ప్రక్రియను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ ప్రకటించారు. ఆలయ పరిసరాల్లో గోశాల సిబ్బంది - 2, గార్డెన్, ఇంద్ర పుష్కరిణి నిర్వహణకు - 2, అన్నప్రసాద వితరణ సిబ్బంది - 13, లడ్డూ, పులిహోర ఇతర ప్రసాదాల తయారీ, ఉచిత ప్రసాద వితరణ సిబ్బంది - 12, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది - 7, మతపరమైన సిబ్బంది - 7, టెక్నికల్ సిబ్బంది - 3 తదితర 46 పోస్టులు కొత్తగా భర్తీ కానున్నాయి. ఈ మేరకు ఒక ఏడాదికి ఏజెన్సీ గుర్తింపునకు ఈనెల 18న సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో టెండర్ ప్రక్రియను నిర్వహించనున్నారు. దీంతో దినసరి వేతనదారులకు బదులు తొలిసారిగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆలయ సేవలో ఉండనున్నట్లు పేర్కొన్నారు.

16 నెలలుగా సీఆర్పీ గైర్హాజరు

- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

పొందూరు: ఉద్యోగులు చెప్పాపెట్టకుండా ఒక్కరోజు సెలవు పెడితేనే అధికారులు సంజాయిషీ తీసుకుంటారు. అటువంటిది ఎటువంటి సెలవు దరఖాస్తు లేకుండా సుమారు 16 నెలలుగా సీఆర్పీ(సీఆర్‌ఎంటీ) విధులకు గైర్హాజరవుతుంటే కనీసం మండల విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని లోలుగు క్లస్టర్ పరిధిలో సీఆర్పీ(సీఆర్‌ఎంటీ)గా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉషాబాల విధులు నిర్వహించేవారు. 2024 ఏప్రిల్ నుంచి కొన్ని రోజులు మెడికల్ లీవ్ పెట్టిన ఆమె ఇప్పటికీ విధులకు గైర్హాజరవుతోంది. సుమారు 16 నెలల నుంచి కనీసం అధికారులకు సమాచారం లేకుండా, సెలవు దరఖాస్తు పెట్టకుండా ఉన్నారు. ఇలా ఉంటే అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత క్లస్టర్ పరిధిలోని పాఠశాలల పనినంతా వేరే క్లస్టర్ సీఆర్పీకి మండల విద్యాశాఖాధికారులు అప్పగించారు. దీంతో రెండు క్లస్టర్ల బాధ్యతల భారం పెరుగుతోంది. దీంతో సుమారు 16 నెలలుగా విధులకు గైర్హాజరవుతున్న సీఆర్పీని తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఉషాబాల గైర్హాజరు విషయంపై ఎంఈవో-2 పటాన్న రాజారావుతో మాట్లాడగా గైర్హాజరు వాస్తవమేనని చెప్పారు. సమాచారాన్ని పలుమార్లు ఎస్ఎస్ఏ అధికారులకు తెలియజేశామన్నారు.

క్లుప్తంగా

ఏకలవ్య పాఠశాలను సందర్శించిన నోడల్ అధికారి



ఏకలవ్య పాఠశాలలో భోజన నాణ్యత పరిశీలిస్తున్న నోడల్ అధికారి సూర్యనారాయణ

మక్కువ: మండలంలోని అనసభద్ర గ్రామం సమీపంలోని ఏకలవ్య పాఠశాలను నోడల్ అధికారి, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సూర్యనారాయణ సోమవారం సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులు తరగతి గదులను, విద్యార్థులు హాజరు, భోజనమెనూ, పాఠశాల పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లు అసంతృప్తికరంగా ఉన్నట్లు గుర్తించారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉందన్నారు. ఆర్వో తాగునీరు అవసరమని, పాఠశాల ఆవరణ చదును చేయాల్సి ఉందని, ఇన్వర్టర్లు, జనరేటర్ అవసరమున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ గుర్తించారు. పై సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పార్వతీపురం యోగా సాధకులు



ప్రశంసాపత్రాలను చూపిస్తున్న యోగా క్రీడాకారులు

పార్వతీపురం రూరల్: జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి యోగా పోటీలు ముగిశాయి. ఈ మేరకు పది నుంచి ఏభై ఏళ్ల వయస్సు గల క్రీడాకారులు ప్రతిభ చూపించారు. ఈ సందర్భంగా వారికి సోమవారం ప్రశంసాపత్రాలు, పతాకాలు అందించారు. ఈ సందర్భంగా పోటీల పరిశీలకుడు భాస్కరరావు మాట్లాడుతూ గెలుపొందిన విజేతలకు ఈ నెల 21నుంచి 24 వరకు తాడేపల్లె గూడెంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు.

గంజాయి నిందితుడి అరెస్టు



పట్టుబడిన నిందితుడితో ఎస్.కోట సీఐ నారాయణమూర్తి

శృంగవరపుకోట: గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని కేరళ రాష్ట్రంలో పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్‌లో కేరళ రాష్ట్రానికి చెందిన బొలెరో వాహనంలో ఇద్దరు వ్యక్తులు 117కిలోల గంజాయితో పట్టుబడ్డారన్నారు. ఈ కేసులో కేరళ నుంచి వాహనాన్ని పంపి గంజాయి తెమ్మని చెప్పిన కేరళ రాష్ట్రం, త్రిశూర్ జిల్లా కట్టూర్ పట్టణానికి చెందిన శ్రీజిత్‌ను కేరళ పోలీసుల సహకారంతో పట్టుకుని అరెస్టు చేసి అక్కడి కోర్టులో ప్రవేశపెట్టి, కోర్టు ఆదేశాల మేరకు ఎస్.కోట తీసుకువచ్చి కోర్టులో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు సెంట్రల్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కేవలం పట్టుబడిన నిందితులపైనే కాకుండా, ప్రోత్సహిస్తున్న మూలాలను వెదికి పట్టుకుని కేసులు పెడుతున్నామన్నారు.

ఎరువుల కోసం నిరసన

సాలూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలకు వేసేందుకు యూరియా దొరకడం లేదు.. బయట మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.. ఎరువును ఎప్పుడు పంపిణీ చేస్తారో చెప్పాలంటూ కురుకుట్టి రైతుభరోసా కేంద్రం వద్ద సోమవారం గిరిజన రైతులు పెద్ద ఎత్తన ఆందోళన చేశారు. కురుకుట్టి పంచాయతీ పరిధిలోని పుల్లమామిడి, బట్టివలస, దళాయివలస, పుల్లేలవలస, తాడ్డివలస, నందేడవలస తదితర 18 గ్రామాల నుంచి సుమారు 400 మంది ఆందోళనలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ తీరును దుమ్మెత్తిపోయారు. ఎరువులు అందించలేని ప్రభుత్వ నిస్సహాయతను ఎండగట్టారు. తక్షణమే ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

పాలకొండ: ఖరీఫ్ సీజన్‌లో వరి ఉభాలు ఆరభమైనా తోటపల్లి ఎడమ కాలువ నుంచి ఆయకట్టుకు సాగునీరు అందడంలేదంటూ రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. జలవనరుల శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, రైతులు కందాపు ప్రసాదరావు, వారాడ సుమంత్‌నాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇంతవరకు సాగునీరు అందకపోయినా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. జూన్ 4వ తేదీన రైతులతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి షట్టర్లు బాగుచేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు చేపట్టలేదని వాపోయారు. వర్షాభావంతో వరి నాట్లు ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సాగునీరు అందించకుంటే క్రాప్ హాలీడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సై ప్రయోగమూర్తి రైతులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

క్రీడాకారులతో ఆటలు..!

- జిల్లా క్రికెట్‌లో చక్రం తిప్పుతున్న సెలక్షన్ కమిటీ సభ్యుడు
- పొరుగు జిల్లాలు, రాష్ట్రాల క్రీడాకారులకు పెద్దపీట
- డమ్మీగా మారిన చైర్మన్, కార్యదర్శులు
- అసోసియేషన్ సభ్యులను ఖాతరు చేయని సెలెక్టర్
- జిల్లా క్రీడాకారులకు న్యాయం చేయాలంటూ మంత్రికి మొరపెట్టుకున్న తల్లిదండ్రులు
- నిమ్మకునీరెత్తినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా క్రికెట్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లా క్రీడాకారుల ప్రాతినిధ్యం తగ్గిపోతోంది. జిల్లా జట్ల ఎంపికలో సెలక్షన్ కమిటీ సభ్యుడి ఒంటెత్తు పోకడలతో జిల్లా క్రీడాకారులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దశాబ్ద కాలంగా ఇదే తరహా వ్యవహారం నడుస్తున్నప్పటికీ, ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ పెద్దలు జిల్లా క్రీడాకారులకు న్యాయం చేస్తామంటూ ప్రకటనలు చేశారు. సంబంధిత శాఖాధికారులతో పాటు, అసోసియేషన్ ప్రతినిధులతో స్థానిక ఎమ్మెల్యే సమీక్ష చేశారు. అయితే ఏడాది కాలమైనా అదే పరిస్థితి కొనసాగడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా క్రికెట్‌లో కీలక స్థానంలో ఉన్న కార్యదర్శితో తనకున్న స్నేహాన్ని ఉపయోగించుకుని జట్ల ఎంపికలో తన మాటే చెల్లుబాటయ్యేలా సెలక్షన్ కమిటీ సభ్యుడు వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు తల్లిదండ్రులు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వద్ద ఏకరువు పెట్టినట్లు సమాచారం. ఇప్పటికై నా దేశానికి ప్రాతినిధ్యం వహించిన విజయనగరం క్రికెటర్ సర్ విజ్జి నడయాడిన జిల్లాలో స్థానిక క్రీడాకారులకే చోటు కల్పించాలని, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు కృషి చేయాలని స్థానిక క్రీడాకారులు, క్రీడాభిమానులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

విజయనగరం కాదు.. విశాఖ 'బి' జట్టు పేరు సార్థకం

విజయనగరం జిల్లా జట్టులో ఒకప్పుడు క్రికెట్ ఆడే క్రీడాకారులు లేక పొరుగు జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చి జిల్లా తరఫున ఆడేవారు. నాటి నుంచి క్రికెట్ వర్గాల్లో విజయనగరం జిల్లా జట్టును విశాఖ బి జట్టుగా పిలిచేవారు. అయితే జిల్లా క్రీడాకారులకు క్రికెట్‌పై అవగాహన పెరగడంతో ఎక్కువ సంఖ్యలో జిల్లా క్రీడాకారులు ఎక్కువమంది క్రికెట్ ను ప్రొఫెషన్‌గా తీసుకున్నారు. దీంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో అధిక సంఖ్యలో క్రీడాకారులు తయారయ్యారు. అయినా గడిచిన మూడు, నాలుగేళ్లుగా విజయనగరం జిల్లా జట్టులో వలస పక్షుల ప్రాతినిధ్యం భారీ స్థాయిలో పెరిగిపోయింది. ప్రతి ఏటా అండర్-12, అండర్-14, అండర్-16, అండర్-19, అండర్-23, సీనియర్స్ విభాగాల్లో ఎంపికలు జరిగితే ప్రతి విభాగంలో సగానికి పైగా పొరుగు జిల్లా క్రీడాకారులకే ప్రాతినిధ్యం కల్పిస్తున్నారు.

అన్నీ వట్టి మాటలేనా?

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరేడు నెలలకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. చైర్మన్‌గా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కార్యదర్శిగా పి.సీతారామరాజు, ఇతర కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అయితే నూతన కార్యవర్గం ఏర్పడిన సమయంలో సభ్యులు, అసోసియేషన్ పెద్దలు స్థానిక క్రీడాకారులకే ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పిన మాటలు వట్టి మాటలు గానే మిగిలిపోయాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2025లో అన్ని విభాగాల జట్ల ఎంపికలో స్థానికేతర క్రీడాకారులకే తగిన ప్రాధాన్యం దక్కినట్లు తల్లిదండ్రులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటీవల అండర్-16 జట్టుకు ఎంపికైన 18 మంది జిల్లా జట్టు క్రీడాకారుల్లో సుమారు 13 మంది పొరుగు జిల్లాలకు చెందిన క్రీడాకారులే ఉన్నారంటే ఇతర జిల్లాల క్రీడాకారుల హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. అలాగే అండర్ -19, అండర్-23, సీనియర్ విభాగంలోనూ వారి ప్రాతినిధ్యం ఎక్కువగా ఉందని తెలుస్తోంది.

దర్జాగా వస్తారు.. జట్టులో చోటు ఎగరేసుకు పోతారు

పొరుగు జిల్లాల క్రీడాకారులు ఇక్కడ వారి సలహాతోనే జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలలో చేరుతారు. వారందించే స్టడీ సర్టిఫికెట్ ఆధారంగా సదరు సెలెక్టర్ వారిని జట్టుకు ఎంపిక చేస్తారు. అయితే వారు పాఠశాలకు వచ్చింది లేదు..వెళ్లిందీ లేదు. ఎందుకంటే ఇక్కడికి ప్రతిరోజు పాఠశాలకు గాని, కళాశాలకు గానీ వస్తే, జిల్లా కేంద్రంలోని విజ్జి స్టేడియంలో ప్రతిరోజు నిర్వహించే ప్రాక్టీస్ సెషన్‌కు ఎందుకు రారని స్థానిక క్రీడాకారులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. స్థానికేతర క్రీడాకారుల తల్లిదండ్రులు ఆధార్ ఇతరత్రా సర్టిఫికెట్లు పొరుగు జిల్లాలోనే ఉంటాయి. వీరివి మాత్రం అన్ని సర్టిఫికెట్లు ఇక్కడే ఉన్నట్లు సెలక్షన్ సమయంలో అందిస్తుంటారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

గుర్రుగా అసోసియేషన్ సభ్యులు

జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యుల తీరుపై అసోసియేషన్ లోని కొంతమంది సభ్యులు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. సెలక్షన్ కమిటీ ఒంటెత్తు పోకడలతో విసుగు చెందిన అసోసియేషన్ సభ్యులు సైతం తల్లిదండ్రులతో పాటు మంత్రి వద్దకు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.

నిబంధనలు పాటిస్తున్నాం:

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి జట్టు ఎంపికల్లో నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నాం. మూడేళ్ల పాటు జిల్లా పరిధిలో చదివే వారికి అవకాశం కల్పిస్తున్నాం. క్రీడాకారుడి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నాం. వాటి ప్రకారమే ఎంపికలకు అనుమతిస్తున్నాం. ఎంపిక ప్రక్రియలో ఎటువంటి అవినీతికి తావులేకుండా చూస్తున్నాం.

– పి.సీతారామరాజు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, విజయనగరం.

అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం అమలుపై ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్‌లు వెంకటేశ్వర రావు, ప్రమీలా గాంధీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్జీల పరిష్కారంపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో, ఉన్నతాధికారుల ఆదేశాల అమలులో కొంతమంది జిల్లా అధికారులు అలసత్వం వహిస్తున్నారని, అర్జీలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కార స్థితిపై రోజువారీ సమీక్ష నిర్వహించుకోవాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 198 అర్జీలు అందజేశారు.



పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల మొరను ఆలకిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 32 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీసౌమ్యలతలు పాల్గొని 32 ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదు దారుల ముందే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్స్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు వివరించారు. ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలుచేపట్టాలని సంబంధిత శాఖ సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

రాజాం సిటీ: మానవతా సంస్థ సభ్యుల్లో మానవత్వం పరిమళించింది. రోడ్డు పక్కన గాయాలతో బాధపడుతున్న అనాథ మహిళకు వైద్యసేవలు అందించి మానవత్వం చాటుకున్నారు. స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో అనాథ మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఓ మూలన ఉన్న మహిళను స్థానికులు గుర్తించి మానవతా సంస్థ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే సభ్యులు ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, కిరణ్‌లు స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత అనాథ మహిళను ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.



గాయపడిన అనాథ మహిళను ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అయితే ఆమె తీవ్రంగా గాయపడడంతో శస్త్రచికిత్స పడుతుందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని వైద్యులు తెలిపారని మానవతా సంస్థ సభ్యులు తెలిపారు. దీంతో పలువురు పట్టణవాసులు వారి సేవలను కొనియాడారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: మండలంలోని బందలుప్పి గ్రామానికి చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఆమె భర్త, అత్తమామలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి తెలిపారు. 2022లో వివాహం జరిగిన అనంతరం అదనపు కట్నం కోసం డిమాండ్ చేస్తూ తనను వేధిస్తూ బందలుప్పి గ్రామంలో కన్నవారింట పిల్లలతో విడిచిపెట్టి భర్త వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో బాధిత మహిళ పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు.

మీరిచ్చిన హామీలు గుర్తు చేయడం తప్పా..?



మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొరకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేయడం తప్పా? మీరిచ్చిన హామీలను గుర్తుచేస్తున్న మాపై తప్పుడు విమర్శలు చేస్తారా? అంటూ మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మండిపడ్డారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని 2,4,5 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమంలో రాజన్నదొర పాల్గొన్నారు. ఈ క్రమంలో వార్డుల్లో తిరిగిన ఆయనకు అడుగడుగునా స్థానిక మహిళలు, ప్రజలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ ఏడాది పాలనలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయలేదని వాపోతూ , తమ సమస్యలను ప్రజలు రాజన్నదొర ముందు ఏకరువు పెట్టారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను మీకు ఈ పాంప్లెట్‌ల ద్వారా ఇస్తున్నామని, క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసినా అవి వస్తాయని ప్రజలకు రాజన్నదొర తెలిపారు.

ఆడబిడ్డ నిధి అమలు చేసేదెప్పుడు?

2024 ఎన్నికల్లో సుమారు 2 కోట్ల 10 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిసిందని అందులో 60 ఏళ్ల పైబడిన వారు సుమారు 60 వేల మందిని తీసేసినా కనీసం కోటి 50 లక్షల మంది మహిళలకు అడబిడ్డ నిధి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నేడు ఆ హామీని అమలుచేయకుండా ప్రజలను మోసం చేసే పద్ధతి సరైంది కాదన్నారు. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పక అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఏ అన్యాయం జరిగినా, ఏ కష్టమొచ్చినా, ఓ సోదరుడిగా, మీ ఇంటి పెద్ద కొడుకుగా అండగా నేను ఉంటానని రాజన్నదొర పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 5 వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి రాజన్నదొర పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు గిరిరఘు, సింగారపు ఈశ్వరరావు, గులిపల్లినాగ, నిమ్మకాయల సువర్ణమ్మ, తాడ్డి లక్ష్మి, శంకరరావు, యశోదకృష్ణ, రౌతు చిన్నయ్య, శ్రీను, చిన్నారావు, పిరిడిరామకృష్ణ, మజ్జి అప్పారావు, కాకి పాండురంగారావు, కొల్లి వెంకటరమణ, హరిబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆనకట్టవద్ద గోతిలో పడి వ్యక్తి మృతి



లక్ష్మణరెడ్డి మృతదేహం



లక్ష్మణరెడ్డి (ఫైల్)

జామి: మండలంలో జామి ఆనకట్టవద్ద గోతిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆనందపురం మండలం బొడ్డుపాలెం గ్రామానికి చెందిన సాడి లక్ష్మణరెడ్డి(38) తన స్నేహితులతో కలిసి స్నేహితుల దినోత్సవం సందర్భంగా జాగరం గెడ్డసీరు జామి గోస్తనినదిలో కలిసే ప్రాంతం వద్దకు ఆదివారం సాయంత్రం వచ్చి సరదాగా గడిపాడు. ఈ క్రమంలో బహిర్భుమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి ఆనకట్టవద్ద ఉన్న గోతిలో పడిపోయాడు. స్థానికులు, రెస్క్యూ బృందం గాలించగా సోమవారం ఉదయం లక్ష్మణరెడ్డి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై మృతుడి భార్య అరుణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జామి ఎస్సై వీర జనార్దన్ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

భోగాపురం: మండలంలోని రావాడ గ్రామానికి చెందిన బుగత ఈశ్వరరావు(47) తగరపువలస లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రావాడ గ్రామానికి చెందిన ఈశ్వరరావుకు భార్య గోవిందమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమధ్య కాలంలో తల్లికి వందనం ద్వారా భార్య బ్యాంకు ఖతాలో డబ్బులు పడ్డాయి. అందులో నుంచి కొంత డబ్బులు ఇవ్వమని భర్త ఈశ్వరరావు భార్యపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో వారిద్దరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెందిన ఈశ్వరరావు నెల 2వ తేదీన గ్రామానికి సమీపంలో ఉన్న భాష్యం లేఅవుట్‌లోకి వెళ్లి పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే తగరపువలస ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. భార్య గోవిందమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పాపారావు కేసు నమోదు చేశారు.

- బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
- గాలిలో కలిసిన ముగ్గురు యువకుల ప్రాణాలు
- కొరిశీల గ్రామంలో విషాదం
- మృతుల్లో ఇద్దరు అన్నదమ్ములు
- కన్నీరు మున్నీరు అవుతున్న కుటుంబ సభ్యులు

దూసుకొచ్చిన మృత్యువు

లారీ ఢీకొని మృతి చెందిన కొరిశీల యువకులు





సిగురు ఉదయ్‌కిరణ్, సిగురు కార్తీక్, దువ్వాన జగన్ (ఫైల్)

కొమరాడ: ఓ ఐదు నిమిషాల్లో వారి ప్రయాణం సుఖవంతమయ్యేది. ఇంతలో లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. వెనుక నుంచి వారు వెళ్తున్న స్కూటీని బలంగా ఢీకొట్టింది. అంతే.. ముగ్గురు యువకుల ప్రాణాలు క్షణాల్లో గాలిలో కలిసిపోయాయి. ఈ హృదయవిదారకర ఘటన కు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొమరాడ మండలం గుణదతీలేస్ పంచాయతీ కొరిశీల గ్రామానికి చెందిన సిగురు కార్తీక్ (21), సిగురు ఉదయ్ కిరణ్ (19) అన్నదమ్ములు. వీరి తల్లి మృతిచెందింది. తండ్రి పురుపాలు ఉన్నారు. భవన నిర్మాణ కార్మికుడిగా ఒడిశాకు వలసవెళ్లి పనిచేస్తున్నాడు. కార్తీక్ ఐటీఐ పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నాడు. తమ్ముడిని చూసేందుకు ఇటీవల గ్రామానికి వచ్చాడు. చక్కగా చదువుకోవాలంటూ డిగ్రీ చదువుతున్న ఉదయ్‌కిరణ్‌కు హితబోధ చేశాడు. తిరిగి హైదరాబాద్ వెళ్లే క్రమంలో గుమ్మ రైల్వేస్టేషన్‌కు తమ్ముడితో పాటు ఇంటర్ చదువుతున్న గ్రామానికి చెందిన దువ్వాన జగన్ (17)తో కలిసి సోమవారం సాయంత్రం బయలుదేరాడు. మరో ఐదు నిమిషాల్లో స్టేషన్‌కు చేరుకుంటారన్న సమయంలో కేజీబీవీ సమీపంలోని ములుపు వద్ద ఒడిశాకు చెందిన లారీ వెను కనుంచి ఢీకొంది. అంతే.. చెల్లాచెదురుగా పడిపోయారు. వారి కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. రోడ్డంతా రక్తంతో తడిసిపోయింది. మాంసం ముద్దలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘట నను చూసిన వారు కన్నీరుపెట్టారు. అయ్యో.. చిన్నవయస్సులోనే మృత్యువు కాటేసిందంటూ రోదించారు. కుటుంబాలను ఆదుకుంటారనుకు న్న యువకుల ప్రయాణం అర్ధాంతరంగా ముగి యడంతో గ్రామంలో విషాదం అలముకుంది.

తోటపల్లి చివరి ఆయకట్టుకు నీరందించాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఖరీఫ్ పంట కాలంలో ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు అందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో నీటి పారుదల శాఖ, తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు నుంచి జూలై ఆరవ తేదీన నీరు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు కింద జిల్లాలోని 12 మండలాల్లో 55444 ఎకరాల ఆయకట్టు ఉందని, 35 కాలువల ద్వారా ఆ ఆయకట్టుకు నీటిని అందించనున్నట్లు తెలిపారు. నీటి సక్రమ పారుదలకు వారా-బందీ పద్ధతి పాటించాలన్నారు. వారా-బందీ పద్ధతిలో సాగునీటిని సక్రమంగా పంపించేందుకు రెవెన్యూ, పోలీస్, నీటి పారుదల శాఖ సిబ్బందితో తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి చౌర్యం జరగకుండా తనిఖీ బృందాలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీటిని సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు ఎస్‌ఈ కేవీఎన్ స్వర్ణకుమార్, నీటిపారుదల, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

ఒప్పంద కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం అమలు చేయాలని కలెక్టర్, జిల్లాస్థాయి కనీస వేతన కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కనీస వేతన కమిటీ సమావేశంలో జూలై 2025 నుంచి జూన్ 2026 వరకు చెల్లించవలసిన కనీస వేతనాన్ని సమావేశంలో నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.510 నుంచి స్కిల్డ్ లేబర్‌కు రూ.526 వరకు, పట్టణ ప్రాంతాలలో అన్ స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.910 నుంచి స్కిల్డ్ లేబర్‌కు రూ.950 వరకు చెల్లించేందుకు కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణయించిన ధరల ప్రకారం ఒప్పంద కార్మికులకు వేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కమిటీ సభ్యులు రోడ్డు భవనాల శాఖ ఎస్‌ఈ కాంతిమతి, సీపీఓ పి.బాలాజీ, కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎస్‌డీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

మృతుడి ఆచూకీ లభ్యం

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో రైవాడ కల్వర్టు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసినట్లు వల్లంపూడి ఎస్సై సుదర్శన్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి రైవాడ కాలువ కల్వర్టువద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన విషయం విదితమే. ఈ సంఘటనపై పలు పత్రికల్లో వచ్చిన వార్తలతో కుటుంబసభ్యులు గుర్తించి వల్లంపూడి స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గజపతినగరానికి చెందిన పీలా శివశంకర్ (41) ప్రమాదంలో మృతిచెందినట్లు చెప్పారు. సమాచారం తెలుసుకున్న శివశంకర్ భార్య పార్వతి స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. మృతిచెందిన శివశంకర్ విశాఖలోని మధురవాడలో ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. రెండోతేదీన ఎస్.కోట వివేకానంద కాలేజీలో ఇంటర్ చదువుతున్న కుమార్తెను చూడడానికి వెళ్లి తిరిగి వస్తుండగా నీలకంఠరాజపురం రైవాడ కల్వర్టు వద్ద ప్రమాదంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు శివశంకర్‌కు భార్య పార్వతి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పార్వతి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఢీ కొన్న గుర్తు తెలియన వాహనంపై బృందాలను ఏర్పాటుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.